పనిచేయని సర్వర్లు

లబ్ధిదారులకు అందని రేషన్ బియ్యం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : పేద ప్రజలకు చౌక దుకాణాల, వాహనాల ద్వారా అందిస్తున్న బియ్యం నేటికీ సక్రమంగా అందడం లేదు. సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో లబ్ధిదారులు బియ్యం అందించే వాహనం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. ప్రతి నెల ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు ఇంటింటికి ప్రభుత్వం బియ్యం అందజేస్తున్నది. నేటికీ బియ్యం 20 శాతం కూడా పంపిణీ కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఏసమయంలోనైనా బియ్యం వాహనం రావచ్చని లబ్ధిదారులు పనులు మానుకొని ఎదురు చూడవలసి వస్తుందని తెలుపుతున్నారు. పనులు మానుకోవడం వల్ల రూ.500 నుండి రూ.800 వరకు సంపాదించే కూలి పోతున్నదని ఆవేదన చెందుతున్నారు. సర్వర్లు పనిచేయకపోతే ఎప్పటి వరకు బియ్యం అందించలేరో చాటింపు ద్వారా గ్రామాల్లో సమాచారం తెలిపితే బాగుంటుందని లబ్దిదారులు పేర్కొన్నారు. సర్వర్లు సక్రమంగా పనిచేస్తే రేషన్ బియ్యాన్ని సమయంతో పని లేకుండా పంపిణీ చేస్తామని పలువురు డీలర్లు తెలుపుతున్నారు. సర్వర్ సమస్య జిల్లా వ్యాప్తంగా ఉందని డీలర్లు పేర్కొన్నారు.

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం సీఎం జగన్ లక్ష్యం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : నిరుపేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందించేందుకే జగనన్న ఆరోగ్య, సురక్ష కార్యక్రమ లక్ష్యమని పిఠా పురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. శుక్రవారం ఉప్పాడలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే దొరబాబుముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పాడ సర్పంచ్. ఉమ్మిడి మేరీ జాన్, జెడ్పీటీసీ గుబ్బల తులసి కుమార్, అమీనాబాద్ సర్పంచ్ నక్క మణికంత(చిన్న బాబు), మండల అధ్యక్షులు అనాల సుదర్శన్, సీనియర్ వైకాపా నాయకుడు సానా నాగు, ఎంపీటీసీలు, వైద్యులు తదితర నాయకులు పాల్గొన్నారు.

బాబుకు అండగా లక్ష సంతకాల సేకరణ

విశాలాంధ్ర - కాకినాడ : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ నిర్బంధంపై ఉద్యమం జరుగుతోందని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. నంద్యాల నుండి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వరకు అనేక రకాలుగా బాబుని ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అక్రమ కేసులో గత 34 రోజులుగా చంద్రబాబు జైలులో ఉన్నారన్నారు. ఉమ్మడి, నూతన ఏపీ రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు ఎంతో కృషి చేశారన్నారు. కాకినాడ జిల్లాలో రాజకీయాలకు అతీతంగా చంద్రబాబుకు అండగా ప్రజలు స్వచ్ఛందంగా లక్ష సంతకాలు చేయనున్నారని వీరిలో వైకాపా సానుభూతిపరులు ఉన్నట్లు నవీన్ చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, బుర్రి సత్యనారాయణ, తూము కుమార్, ఎండీ జహీరుద్దీన్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు తగదు

విశాలాంధ్ర - కాకినాడ : జగన్మోహన్ రెడ్డి సామర్లకోట పర్యటనలో భాగంగా జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలను జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కాకినాడ ప్రథమ మేయర్ పోలసపల్లి సరోజ తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పోటీ చేసే సత్తా పవన్ కళ్యాణ్‌కి ఉందని, జగన్ రెడ్డికి దమ్ముంటే పులివెందుల నుంచి కాకుండా వేరే చోట నుంచి పోటీ చేసి నెగ్గాలని జనసేన పార్టీ తరపున సరోజ సవాల్ విసిరారు. 33 లక్షల ఇళ్లల్లో కాకినాడ స్థానం ఎక్కడ? అని ప్రశ్నించారు. 3000 మంది కౌలు రైతులకు సుమారు 30 కోట్ల రూపాయల సొంత నగదును అందించిన పవన్ కళ్యాణ్ వారికి దత్తపుత్రుడేనని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చి రాజకీయ విమర్శలు చేయడం జగన్మోహన్ రెడ్డి దిగజారుడు రాజకీయానికి నిదర్శనం అన్నారు.

రాష్ట్ర ప్రజల ఆరోగ్య బాధ్యత సీఎందే

విశాలాంధ్ర - జగ్గంపేట : రాష్ట్ర ప్రజల ఆరోగ్య భాధ్యత సిఎం జగన్ మోహన్ రెడ్డి తీసుకున్నారని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. నియోజక వర్గ కేంద్రమైన జగ్గంపేట 1వ సచివాలయం పరిధిలో శివాలయం వీధిలోని ప్రభుత్వ పాఠశాల వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు చేయించేందుకు ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రోగులు ప్రతి ఒక్కరూ ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో దాక్టర్లు రోగులకు పరీక్షలు నిర్వహించగా మందుల కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. బాలింతలకు న్యూట్రిషన్ ఫుడ్, మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఉప సర్పంచ్ బండారు రాజా, మార్కెట్ కమిటీ ఛైర్మన్ జనపరెడ్డి బాబు, తదితర ప్రజాప్రతినిధులు, జిల్లా జెసి ఎస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్, ఎంపిడిఓ వసంత్ కుమార్, తదితర అధికారులు పాల్గొన్నారు.

భువనేశ్వరిని కలిసిన మద్దిపాటి

విశాలాంధ్ర-దేవరపల్లి : మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరిని గోపాలపురం నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు కలిశారు. శుక్రవారం రాజ మండ్రిలో ఆమెను కలిశారు. ఈ సందర్భంగా మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడుపై అక్రమంగా కేసులు ఇరికించి జైలులో పెట్టటం రాష్ట్ర ప్రజలందరూ జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరిని చంద్రబాబు నాయుడు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మద్దిపాటి వెంకట రాజు వెంట తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు ముళ్ళపూడి దొరాజీ చౌదరి ఉప్పులూరి రామారావు పెనుమత్స సుబ్బరాజ కందేపు వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - అయినవిల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం అని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శుక్రవారం అయినవిల్లి లంక ఎంపియూపి పాఠశాలలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి, సేవలను పరిశీలించారు. శిబిరం ప్రారంభంలో కొందరు అస్వస్థతకు గురికాగా, జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్ వెంటనే స్పందించి వారికి ముందుగా వైద్య సహాయం అందించాలని డాక్టర్‌లకు సూచించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ కుమ్మరి మాధవీలత అధ్యక్షత వహించగా ఎంపిపి మట్టపర్తి నాగ విజయలక్ష్మి, వైస్ ఎంపిపి బయ్యా చినబాబు, మండల వైసిపి అధ్యక్షుడు కుడుపూడి విద్యా సాగర్, దేవస్థానం చైర్మన్ గుత్తుల నాగబాబు, బొంతు రాజేంద్ర ప్రసాద్, ఎంపీటీసీ దాసరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు భారతదేశం ఆదర్శంగా నిలవాలి

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంతప్రాధాన్యత నిస్తుందని, ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా ఉన్నంత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే. మాధవీలత విద్యార్థులకు సూచించారు. అజాదీకా అమృత్ మహోత్సవ్, "నా మట్టి నా దేశం" కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ మాధవీలత శుక్రవారం స్థానిక లాలచెరువు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో ప్రోత్సా హాన్ని అందిస్తూ పాఠశాలలను ఆధునీకరిస్తూ, మౌలికసదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి చిన్నారి చదువుకోవాలని వారి విద్యకు అయ్యే ఖర్చు వారి తల్లిదండ్రుల మీద భారం పడకూడదనే లక్ష్యం తో ప్రభుత్వం అమ్మఒడిని అందిస్తూ, మరో వైపు పౌష్టికాహారంగా మధ్యాహ్నం భోజనంగా జగనన్న గోరు ముద్ద పథకాన్ని ప్రభుత్వ అమలు చేస్తుందన్నారు. పాఠశాల విద్య పూర్తవ్వగానే ఇంటర్ లో జగనన్న విద్య దీవెన, వసతి దీవెన ప్రభుత్వం అందిస్తున్నా మన్నారు. ఉద్యోగం రావాలంటే బయట పోటీ తత్వం ఎక్కువగా ఉన్నందున డిగ్రీ లోనే ఆయా కోర్సులతో పాటు జీవనోపాధికి అవసరమైన నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందిస్తున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛమైన మట్టి, గాలి సమగ్ర అభివృద్ధిని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు అజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా 'నా భూమి- నా దేశం' కార్యక్రమాలను దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటున్నా మన్నారు. మన భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలయిన తరువాత మన భారత దేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.

రవి సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర - కాకినాడ : ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలపై ప్రచారం, మీడియా సంక్షేమ పథకాల అమలులో సహాయ పౌర సంబంధ అధికారిగా కె. రవి అందించిన సేవలు ప్రశంసనీయమైనవని సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. నాగార్జున కొనియాడారు. డివిజనల్ పౌర సంబంధాల అధికారిగా పదోన్నతి పొంది విజయవాడ బదిలీ పై వెళుతున్న సహాయ పౌర సంబంధ అధికారి కె. రవిని డిఐపిఆర్ఓ కాకినాడ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సమాచారశాఖ డిడి డి.నాగార్జున మాట్లాడుతూ గడచిన మూడేళ్లుగా కె. రవి నిబద్ధత, అంకిత భావాలతో సేవలు అందించి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, మీడియా ప్రతినిధుల ఆదరాభిమానాలను చూరగొన్నారని ప్రశంసించారు. జర్నలిస్ట్‌లకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమాలు వారికి సమగ్రంగా అందించడంలో రవి సేవలు అందరి హర్షాన్ని అందుకున్నాయన్నారు. . పదోన్నతి పై వెళుతున్న పిఆర్ఓ కె. రవి మాట్లాడుతూ ఎన్నో విశిష్టతలు కలిగిన కాకినాడ జిల్లాలో పనిచేయడం ఎంతో ఆనందం కలిగించిందన్నారు. తనకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో సమాచార శాఖ అధికారులు ఏఈఐఈ సి బాబూరావు, ఎపిఆర్ఓ ఎస్. అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో మేరా మట్టి మేరా దేశ్

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం భూపయ్య అగ్రహారంలో శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మేరా మట్టి మేర దేశ్ కార్యక్రమం పట్టణ అధ్యక్షుడు వెంపరాల భాస్కర శాస్త్రి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా మానేపల్లి, బిజెపి జిల్లా అధ్యక్షులు యాళ్ల దొరబాబు, బిజెపి జిల్లా ఇన్‌చార్జి పొట్లూరి రామ్మోహన్ రావు, అనకాపల్లి ఇన్‌చార్జి కర్రీ చిట్టిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు తామ గ్రామాల నుండి సేకరించిన మట్టిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్‌వి నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలలో డ్రైనేజీ పనులు

విశాలాంధ్ర - కరప : కరప ఎస్సీ కాలనీలలో మురుగునీరు పోయేందుకు యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీ పనులను చేపట్టాలని కాకినాడ రూరల్ శాసనసభ్యులు మాజీ మంత్రి, కురసాల కన్నబాబు ఆదేశాలు జారీ చేయడంతో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ పనులను పరిశీలించేందుకు వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, గ్రామ సర్పంచ్ సాదె ఆశాజ్యోతి కుమార్, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర కుమార్, కేశవరావు, సుధీర్, పనులను పరిశీలించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ స్కూల్ నక్క వారి పేటలో ప్రభుత్వం స్కూళ్లకు అందించిన వంట పాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సాదె వీర రాఘవులు, ప్రధానోపాధ్యా యులు వీణాధరి, నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో అద్భుతమైన సేవలు

విశాలాంధ్ర-పెరవలి : పెరవలి మండల వ్యాప్తంగా జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో అంగన్వాడీ లు అద్భుతమైన సేవలు అందిస్తున్నారని పెరవలి మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు కార్చెర్ల సీతారాం ప్రసాద్ అన్నారు.మండలంలో గల ఖండవల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు.ఈశిబిరాన్ని కార్చెర్ల సీతారాం ప్రసాద్ మహిళలతో కలసి ప్రారంభించారు.ఈశిబిరం నిర్వహణలో వైద్య సిబ్బంది సేవలతో పాటు అంగన్వాడీలు ఆశా వర్కర్లు డ్వాక్రా వివో ఏలు అద్భుతమైన పాత్ర పోషిస్తున్నారని ఆయన కొనియాడారు.ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది తక్కువ ఖర్చులో తయారు చేసిన పౌష్టికాహారాన్ని ఆయనతోపాటు ఎంపీడీవో దామోదరరావులు రుచి చూసి అంగన్వాడీలను వారి శ్రమను నైపుణ్యాన్ని మెచ్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీలు పంచాయతీ నెంబర్లు వైద్యశాఖ అంగన్వాడి పంచాయితీ సచివాలయాల శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఎనిమిది గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

విశాలాంధ్ర - సీతానగరం: మండల వ్యాప్తంగా ఉన్న ఎనిమిది గ్రామాల్లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. మండలంలో రఘుదేవపురం, రాపాక, సింగవరం, వంగలపూడి, చినకొండేపూడి, మీర్తిపాడు, కాటవర, పురుషోత్తపట్న గ్రామాల్లో ఆర్ బీ కెల పరిధిలో ఖరీఫ్ వరి పంట కొనుగోలు కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి సూర్య రమేష్, అర్‌బికె చైర్మన్ వలవల వెంకటరాజు ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి రామకృష్ణ, ప్రసాద్, ఏ యు శ్రీనివాస్, వి ఏ ఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

డా॥బి॥ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కందికుప్ప గరువుపేటకు చెందిన **పచ్చిమాల శ్రీదేవి D/o నాగేశ్వరరావు** వయస్సు 22 యొక్క ఒరిజినల్ పాస్ పోర్ట్ నెం: **W8097050** పడిపోయినది. **ది.10-10-2023** తేదీన గరువుపేట నుంచి కాట్రేనికోన సెంటర్‌లో జిరాక్స్ షాపు నందు జిరాక్స్ తీయించుకుని ఆటోలో ఇంటికి తిరిగి వెలుతుండగా మధ్య మార్గంలో పాస్పోర్ట్ పడిపోయినది. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కి తెలియజేయగలరు.

పచ్చిమాల శ్రీదేవి D/o నాగేశ్వరరావు
కందికుప్ప (గరువుపేట) కాట్రేనికోన మండలం
సెల్: 95058 07599

మత్స్యకారులకు వేట వలలు పంపిణీ

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : వేదాంత ఫౌండేషన్ ద్వారా ఎస్. యానంకు చెందిన సొసైటీ మత్స్యకారులకు వలలు పంపిణీ చేసినట్లు రాష్ట్ర రవాణా శాఖ మాత్యులు పినిపే విశ్వరూప్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన అభ్యర్థన మేరకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద వేదాంత ఫౌండేషన్ వారు సుమారు రూ.30 లక్షల వ్యయంతో 6.6 టన్నుల బరువు గల వలలను సమకూర్చినట్టు తెలిపారు. వాటిని ఎస్ యానంకు చెందిన 165 మంది సొసైటీ మత్స్య కారులకు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘాల ప్రతినిధులు జిల్లా మత్స్య శాఖ సంయుక్త సంచాలకులు షేక్ లాల్ మహమ్మద్, గ్రామ సర్పంచ్ జోగి రాజా, జెడ్పిటిసి గెద్దం సంపద రావు, తుని నియోజకవర్గ వైసీపీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు పొగాకు శీను, వేదాంత సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆరోగ్యంపై ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలి

విశాలాంధ్ర - అమలాపురం : మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి హరీష్ బాలయోగి డిమాండ్ చేశారు. ప్రభుత్వ కుట్రల కారణంగా రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉన్న చంద్రబాబు క్షేమం విషయంలో పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే అని గుర్తు చేశారు. ఈ మేరకు స్థానిక కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కక్ష సాధింపు చర్యలకు కూడా హద్దు ఉంటుందని, వయస్సు, ప్రజా సంక్షేమం పట్ల చంద్రబాబుకు ఉన్న కార్యదీక్షకు కచ్చితంగా విలువ ఇవ్వాలన్నారు. న్యాయానిదే తుది విజయమని, ప్రభుత్వ కుట్రల నుంచి త్వరలోనే చంద్రబాబు క్షేమంగా బయటకు రావాలని హరీష్ బాలయోగి ఆకాంక్షించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలంలోని పులిదిండి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంపిడిఓ నాతి బుజ్జి, డాక్టర్ సుమలత పర్యవేక్షణలో తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, డాక్టర్ సౌమ్య ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ కనుమూరి సూర్య సుందర సీతా కుమారి, అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు, కుండ అన్నపూర్ణ జడ్పీటీసీ సభ్యులు బోణం సాయిబాబా, ఆప్కాస్ డైరక్టర్ కప్పల శ్రీధర్, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ కనుమూరి శ్రీనివాస రాజు, వైస్ ఎంపీపీ పెన్మెత్స బంగార్రాజు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. డాక్టర్ బి. దుర్గా భవాని, డాక్టర్ డి. చైతన్య, డాక్టర్ ఎస్ స్వప్న వైద్య సేవలు అందించారు. ఈ క్యాంపులో భాగంగా ఉచితంగా ఈసీజీ, ల్యాబ్ పరీక్షలు నిర్వహించి, 105 రకాల మందులను పంపిణీ చేసారు. తొమ్మిది మందికి కళ్లజోళ్లను అందించారు. మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ కనుమూరి శ్రీనివాస రాజు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పులిదిండి గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, పులిదిండి గ్రామ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి సహకరించిన శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డికి, వైద్య బృందానికి, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈఓఆర్డీ డి శ్రీనివాసరావు, ఎంఈఓ వర ప్రసాదరావు, పంచాయితీ కార్యదర్శి, యం శివరామ రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, ఎఎన్‌యంలు పాల్గొన్నారు.

నెరవేరనున్న దళితుల కల

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్ళపూడి మండలం పెద్దేవం గ్రామంలో గత కొన్ని సంవత్సరాలు నుండి కల గా మిగిలిపోయిన దళితుల స్మశాన వాటిక రహదారి ఇన్నాళ్లకు నెరవేరుతున్నది. ఈ గ్రామానికి అనేక దఫాలు దళితులు సర్పంచ్‌లు గా చేసిన, గతం లో తాళ్ళపూడి మండలానికి, కొవ్వూరు నియోజకవర్గానికి దళితుల ప్రాతినిధ్యం వహించినా ఇన్నాళ్లు నెరవేరని శ్మశాన వాటిక రహదారి ఎట్టకేలకు తాళ్ళపూడి ఎంపీపీ పోసిరాజు పట్టుదల, నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వనిత సహకారం, కృషి ఫలితంగా 400 మీటర్ల రహదారికి 20 లక్షల కు పైగా నిధులు వెచ్చించి పనులకు శ్రీకారం చుట్టారు. రోడ్డు కిరువైపులా ఉన్న రైతులు, ఎస్సీల సహకారం వేరసి పటిష్టమైన దారిని దళిత సర్పంచ్ వెంకట్రావు పదవీకాలం లో పూర్తి చేస్తున్నారు.

క్రమశిక్షణ, పట్టుదల ఉన్నత శిఖరాలకు చేరుస్తాయి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో పేరవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్ & బ్యాడ్ టచ్ పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో విద్య ప్రాముఖ్యత వెలకట్టలేనిదన్నారు. విద్యార్థులందరూ మంచి ప్రవర్తన కలిగి చదువులో రాణించాలని మండల పరిషత్ అధ్యక్షురాలు కుందా అన్నపూర్ణ అన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థుల ప్రవర్తన వారి భవిష్యత్ పై ప్రభావితం చూపుతుందని ఎస్ఐ బి. కిరణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వరప్రసాద్, సిడిపివో శారదా దేవి, సర్పంచ్ విజయ భారతీ నాగేశ్వరరావు, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపరవైజర్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు ఎస్‌విఎస్‌ఎస్ ప్రసాద్, శ్యామ్, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

నా యొక్క **హెచ్0922806** నెంబరు గల పాస్‌పోర్టు మూలస్థానంలో మా ఇంటి వద్ద ఎక్కడో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రసుకు తెలుపగలరు.

కంచుమర్తి సుబ్బారావు, తండ్రి సుబ్బారాయుడు,
మూలస్థానం, ఆలమూరు మండలం.
సెల్ : 94908 88086

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

విద్యుత్‌చార్జీలు తగ్గించాలి

వామపక్షాల డిమాండ్

విశాలాంధ్ర-దేవరపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల నడ్డి విరుస్తూ పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు మోటర్ కనెక్షన్లు పెట్టరాదని కోరుతూ 10 వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం దేవరపల్లి వివిధ సెంటర్లలో సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, సిపిఐ ఎంఎల్ పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపుదలకు నిరసనగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో భాగంగా తను అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచ బోనని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని అన్నారు. గత సంవత్సరం విద్యుత్ చార్జీల పెంపు ద్వారా 1400 కోట్ల రూపాయల ప్రజలపై భారం వేశారని, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల నెత్తి మీద ప్రస్తుతం ఆరు వేల కోట్ల రూపాయలు భారం వేస్తున్నారని తెలిపారు. తక్షణమే పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని మోటార్లకు స్మార్ట్ మీటర్లను బిగించే ఆలోచన మానుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి ఆచంట సత్యనారాయణ, సిపిఐ నాయకులు బోనుల పోతురాజు, గన్న మని సూర్యచంద్రరావు, ముత్తిరెడ్డి దాలేశ్వరరావు, సిపిఎం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, ఎస్ కే భగత్, ఆచంట సుభాష్ చంద్రబోస్, కే రత్నాజీ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు సిహెచ్ రమేష్, పి నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు పోలమాటి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం లక్ష్యం

విశాలాంధ్ర-దేవరపల్లి : ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ గా రాష్ట్రాన్ని తీర్చి దిద్దటానికే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పేర్కొన్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సర్పంచ్ బొంత నాగమణి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ పేదల వైద్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ ఆరోగ్య విధానం తీసుకుని వచ్చిందని అన్నారు. ఈ విధానం వలన డాక్టర్లు ఇంటికి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసీ చైర్మన్ జి. జనార్ధన్ రావు. ఎంపీపీ కేవీకే దుర్గారావు జెడ్పిటిసి పొట్టి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర - గోపాలపురం : పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయడమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయం అని గోపాలపురం శాసనసభ్యులు తలారి వెంకట్రావు తెలిపారు. శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవంలో భాగంగా గోపాలపురం ఆర్‌బికేలో ఆయన ధాన్యం కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పంటను సరైన ధరకు అమ్ముకోవడానికి ఇబ్బంది పడకుండా ఉండడం కోసం మద్దతు ధరను ప్రకటించి కోతలకు ముందుగానే ధాన్య కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే చెల్లుతుందని తెలిపారు. రైతులకు ధాన్యం అమ్ముకోవడానికి అవసరమైన గోనెసంచులను, రవాణా కూలీలకు చార్జీలను ప్రభుత్వం భరిస్తుంది అన్నారు. రైతు సొంతంగా వాటిని సమకూర్చుకున్నట్లయితే దానికి సంబంధించిన చార్జీలు రైతు ఖాతాలోనే నేరుగా జమ చేయనున్నట్టు తెలిపారు. స్థానికంగా ఉన్న వ్యాపారస్తులకు తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించి ఇబ్బందులు పడవద్దని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేదోడువాదోడు గా ఉంటుందని ఈ అవకాశాన్ని రైతు సోదరులు అందరూ వినియోగించుకోవాలని ఎంపీపీ ఉండవల్లి సత్య నారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్కే ఖాదర్ వలీ, వ్యవసాయ సలహా మండలి జిల్లా స్థాయి సభ్యులు కూసం రామ్మోహన్ రెడ్డి,హాస్పిటల్ అభివృద్ధి డైరెక్టర్ ముల్లంగి శ్రీనివాస రెడ్డి గోపాలపురం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జజ్జవరపు అన్నవరం, ఎంపీడీవో ఆర్. శ్రీదేవి, తహసిల్దార్ బి. రవీంద్రనాథ్ ,ఎంఏఓ బి. రాజారావు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2.1 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామం నుండి కేతరాజుపల్లి మీదుగా ఈతకోట-కొత్తపేట రోడ్డు వరకు 1కోటీ 30 లక్షల రూపాయలతో నిర్మించనున్న ఆర్ అండ్ బి రోడ్డు పనులకు, ఈతకోట-కొత్తపేట రోడ్డులో కొత్తపేట మండలం పెదగూళ్ళపాలెం నుండి కొత్తపేట వరకు 80 లక్షల రూపాయలతో నిర్మించనున్న ఆర్ అండ్ బి రోడ్డు పనులకు ప్రభుత్వ విప్, శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సత్య ప్రణీత్ ఎంపిక

విశాలాంధ్ర - కరప : నక్క సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ హైస్కూలులో 8వ తరగతి చదువుతున్న జి. సత్య ప్రణీత్ జిల్లా స్థాయి పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీల మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో జడ్పిటిసి వై సుబ్బారావు, ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మి సత్తిబాబు, సర్పంచ్ ఆశాజ్యోతి కుమార్, ఎంఈఓ బుల్లి కృష్ణవేణి ముఖ్య అతిథిగా పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు హాని కలిగితే బాధ్యత ప్రభుత్వానిదే

విశాలాంధ్ర - పి గన్నవరం : టిడిపి అధినేత చంద్రబాబుకు ఏ విధమైన హాని కలిగినా బాధ్యత వైకాపా ప్రభుత్వానిదేనని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డొక్కా నాథ్ బాబు అన్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో టిడిపి అధినేత చంద్రబాబు అనారోగ్యానికి గురి కావడంపై వైకాపా ప్రభుత్వ తీరును నిరసిస్తూ పి గన్నవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులతో కలిసి ఆయన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు వైకాపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పి గన్నవరం గ్రామ సర్పంచ్ బొండాడ నాగమణి, టిడిపి నాయకులు సంసాని పెద్దిరాజు, ఆరుమిల్లి లాల్ బాబు, సాధనాల ఎస్వీ, శేరు శ్రీనుబాబు, చీకట్ల రామకృష్ణ, మండపాటి కిరణ్ కుమార్, చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, ఆరుమిల్లి సాయిబాబు, నారిన సత్తి పండు, ముచ్చర్ల సాయి సత్యనారాయణ, పెచ్చెట్టి ఈశ్వర్, వేమన గంగాధర్, గనిశెట్టి ఈశ్వర్, కామాడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ముందస్తు దసరా

విశాలాంధ్ర - ఏలూరు : స్థానిక శాంతినగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రైమరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులు పాల్గొని వారి ఆటపాటలతో,దసరా అవతారాలతో అలరించారు. ప్రిన్సిపాల్ బి. శివకుమారి మాట్లాడుతూ దసరా సెలవులు ప్రారంభమవుతున్న సందర్భంగా దసరా పండుగ ముందస్తుగా జరుపుకోవడం దాని ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరంగా చెప్పడం ఎంతో ఆవశ్యకత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్, మ్యూజిక్ అండ్ డాన్స్ పోటీలు నిర్వహించారు. చిన్నారులందరూ వివిధ వేషధారణలో అమ్మవారి పది రోజులు పది అవతారాలలో చక్కగా తమ అభినయాన్ని ప్రదర్శించారు. ఏజీఎం పార్థసారథి, జోనల్ కోఆర్డినేటర్ సిహెచ్ ఉదయభాస్కర్, జోనల్ ప్రైమరీ కోఆర్డినేటర్ కవిత రాజేశ్వరి, జోనల్ ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్‌షమ్మీ,ఏలూరు వన్ అకాడమిక్ డీన్ సంజీవ్ కుమార్, ప్రైమరీ ఇన్చార్జ్ నరిన, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి షబానా, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులకు, తల్లితండ్రులకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ రోడ్లు శుభ్రం చేసిన టీడీపీ నేతలు

విశాలాంధ్ర-పాలకొల్లు: చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ పాలకొల్లు పట్టణంలో టిడిపి నాయకులు రోడ్లను శుభ్రం చేశారు. శుక్రవారం పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల సారథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు ఎలాంటి తప్పు చేయలేదని, అక్రమ అరెస్టును ఖండిస్తున్నామన్నారు. గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి బాబు, దాసరి రంగరాజు గండేటి శేఖర్, టిడిపి జనసేన నాయకులు పాల్గొన్నారు.

34వ రోజుకు చేరుకున్న టిడిపి దీక్షలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్ర బాబును అక్రమంగా అరెస్టు చేయ దంతో కొయ్యలగూడెం పట్టణంలో నిర్వహిస్తున్న సామూహిక నిరాహార దీక్ష 34వ రోజుకు చేరుకోవడంతో నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసరావు, మొడియం సూర్యచంద్రరావు, పట్టణ అధ్యక్షుడు జేష్ట రామకృష్ణ, ఏలూరు పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, పోలవరం నియోజకవర్గ ప్రచార కన్వీనర్ రాచూరి మదన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చంద్రబాబును విడుదల చేయాలని కోరుతూ సైకో, పోవాలి సైకిల్, రావాలి అంటూ నినాదాలు పలికారు. అనంతరం చంద్రబాబు ఆరోగ్యం విషయంలో వైద్యులు మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ తహసీల్దార్ పి. నాగమణికి కార్యాలయం వద్ద వినతి పత్రాన్ని అందజేశారు.

నాయకులకు, కార్యకర్తలకు అండగా జనసేన

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆపదలో ఉన్న జనసేన పార్టీ నాయకులకు కార్యకర్తలకు, జనసేన పార్టీ ఎప్పుడు తోడు ఉంటుందని నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్రి బాలరాజు పేర్కొన్నారు. మండలంలో దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన పార్టీ క్రియాశీలక సభ్యుడు దాకర.మధు, సోదరి గత కొద్ది రోజుల క్రితం బయ్యన్నగూడెం కొయ్యలగూడెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై కారు ప్రమాదంలో మృతి చెందారని, ఆమె భర్త వెంకటరమణ కూడా గాయాల పాలయ్యారని, దిప్పకాయలపాడు గ్రామంలో వారి ఇంటి వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, చిర్రి బాలరాజు, మండల పార్టీ అధ్యక్షులు తోట వీర వెంకట సత్యనారాయణ, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. జనసేన పార్టీ తమకు ఎప్పుడు అండగా ఉంటుందని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి పాదం కృష్ణ, కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, పోలవరం మండల అధ్యక్షుడు గుణపర్తి వెంకట సత్యనారాయణ, అప్పన ప్రసాద్,జనసేన పార్టీ నాయకులు,కార్యకర్తలు,వీర మహిళలు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చమరగీతం పాడాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: రాష్ట్రంలో అరాచక పాలనకు చమరగీతం పాడాలని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీ రామ మూర్తి అన్నారు. కె జగ్గవరం గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తెలుగు దేశం పార్టీ మినీ మేనిఫెస్టో ను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబును రాజకీయ కక్షతోనే అరెస్టు చేశారని ఆయన తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసిన కడిగిన ముత్యం లా బయటకు వస్తారని ఆయన తెలిపారు.తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వస్తే 18 ఏళ్ళు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు 15 వందలు,తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థులకు 15వేలు, దీపం పథకం ద్వారా ఉచితంగా 3గ్యాస్ సిలిండర్లు,అన్నదాతలకు ఏడాదికి 20 వేలు,నిరుద్యోగులకు నెలకు 3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కేతవరం ఉప సర్పంచ్ భీమవరపు భీమవరపు జగన్మోహన రావు , జయ్యవరపు శ్రీనివాస రావు, బొందల పాటి సత్యనారాయణ, డోలా రామయ్య, పరసా జోజి, అగ్నిపర్తి సాంబయ్య, డోలా రాణి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు ప్రభుత్వ కళాశాలలో ఫ్రెషర్స్ డే

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు పట్టణంలోని ఏయస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకొల్లు వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జి గుడాల గోపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును తామే అందంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.రాజ రాజేశ్వరి, జిల్లా కార్యదర్శి కొండేటి రవి, నిమ్మకాయల రామకృష్ణ, శ్రీనాథ్, కొమ్ముల మురళీ కృష్ణ, కారుమురి రామలింగేశ్వర రావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : మండలంలోని అంకన్న గూడెం సచివా లయ పరిధిలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఆయన అన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పరిపాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ కే దక్కుతుందన్నారు. ప్రజలందరినీ సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. పార్టీలకతీతంగా తమ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొరస పోచమ్మ. జడ్పిటిసి మల్లం వసంతరావు, వైస్ ఎంపీపీ సోమ గాని శ్రీనివాసరావు, సర్పంచ్ పైదా ముత్యాలమ్మ,మండల కన్వీనర్ చందా ప్రసాద్, సచివాలయ మండల కన్వీనర్ వనమా రామకృష్ణ, సొసైటీ అధ్యక్షులు బోద శ్రీనివాసరెడ్డి, ఘంటసాల గాంధీ, నాయకులు పైదా వెంకటేశ్వరరావు,సామ్యూల్ భాష, మేడిశెట్టి రాముడు, వివిధ మండల శాఖ అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాబుతో నేను కరపత్రాల పంపిణీ

విశాలాంధ్ర-తణుకు: తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం పట్టణంలోని వెంకటేశ్వర సెంటర్ నుండి "బాబుతో నేను" కరపత్రాలను పంచుతూ స్కిల్ డెవలప్మెంట్ లోని నిజానిజాలను వివరిస్తూ బాబు కు మద్దతు తెలియచేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వానికి సంబంధించినంత వరకు ఏ అవినీతి జరిగిందనేది ఇప్పటివరకు కూడా ఆధారాలు సమర్పించలేక కేవలం టెక్నికల్ పాయింట్ల మీద వ్యవస్థలను మేనేజ్ చేస్తూ బెయిల్ రాకుండా అడ్డుకుంటు న్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు 44 సంవత్స రాలుగా రాజకీయంలో తనదైనటువంటి ముద్ర వేసుకున్న నాయకు డన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ దొమ్మేటి వెంకట సుధాకర్, తణుకు మండల అధ్యక్షులు పీతాని మోహన్, ఇరగవరం మండల అధ్యక్షులు గోపిశెట్టి రామకృష్ణ, ఒమ్మి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

విశాలాంధ్ర-తణుకు: ఇష్టంతో విద్య అభ్యసించి భవిష్యత్తును తీర్చిదిద్దు కోవాలని, మానసిక శక్తితో పాటు శారీరక శక్తి కూడా ప్రతి ఒక్కరికి ఉండాలని దానికోసం యోగ, ఆటలు నేర్చుకోవాలని ఎస్ కే ఎస్ డి మహిళా కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి అన్నారు. శుక్రవారం ఎస్ కె ఎస్ డి మహిళా కళాశాల (డిగ్రీ,పీజీ, ఆటానమస్) లో కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో చిట్టూరి సత్య ఉషారాణి పాల్గొని మాట్లాడారు. ముందుగా కళాశాల ఫౌండర్ చిట్టూరి సుబ్బారావు చిత్రపటానికి నివాళులు అర్పించి కార్యక్రమం ప్రారంభించారు. వివేకానంద గ్లోబల్ స్కూల్ సెక్రెటరీ రీనా సాయి మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణతో పాటు విద్యను నేర్చుకుంటూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి, రంగస్థల నటుడు, విశ్రాంత వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడు వాడ్రేవు సుందర్ రావు మాట్లాడుతూ స్త్రీ విద్య సమాజ పురోగతికి మొదటి మెట్టు మాత్రమే కాకుండా, దానితోపాటు వ్యక్తిత్వ వికాసము కలుగజేసే ఆయుధం అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిని కళాశాల యజమాన్యం ఘనంగా సత్కరించారు. జర్నలిజం లో డిప్లమో సాధించిన విద్యార్థులకు ఈ సందర్భంగా సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల ట్రెజరర్ నందిగం సుధాకర్, జాయింట్ సెక్రెటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు లు కొత్తగా చేరిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కళాశాలలోని సౌకర్యాన్ని వినియోగించుకుని అభివృద్ధి సాధించాలని తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ లెఫ్టినెంట్ యు ఎల్ సుందరి భాయ్, విద్యార్థి సంఘ సభ్యులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రజలు ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

చంద్రబాబుకు మెరుగైన వైద్యం అందించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెదేపా జాతీయ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోగ్య విషయంలో జగన్ ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని, మెరుగైన వైద్యం అందించాలని టిడిపి మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు ఆరోగ్య విషయంలో చాలా శ్రద్ధ తీసుకుంటారని, ఆయనను జైలులో పెట్టి ,మానసి కంగా, ఆరోగ్యకరంగా, క్షోభకు గురి చేస్తున్నారని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు రూపంలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

నా భూమి నా దేశం కలశ యాత్ర

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు ఆధ్వర్యంలో శుక్రవారం గోపినాధపట్నం గ్రామ పంచాయతీ వద్ద నాభూమి - నాదేశం కలశ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామం నుండి మట్టిని కలశములో సేకరించారు. అనంతరం ర్యాలీ చేసి ప్రతిజ్ఞ చేసారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుత్సకాయల విష్ణుమూర్తి, సచివాలయ కన్వీనర్ గంటా లక్ష్మణరావు, డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్, విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పాల్గొన్నారు.

జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించిన జనసేన

విశాలాంధ్ర-ఉంగుటూరు : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పై సీఎం జగన్మోహన్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు ఖండిం చారు. శుక్రవారం ఆయన నారాయణ పురంలో ధర్మరాజు మాట్లాడారు. జగన్ మోహన్ రెడ్డి తీరుకు నిరసనగా శనివారం ఉదయం 10 గంటలకు ఉంగుటూరు నియోజక వర్గం జనసేన పార్టీ కార్యాలయం సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలపై నిరసన చేస్తామన్నారు.

చంద్రబాబు ఆరోగ్యం పట్ల ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలి

విశాలాంధ్ర-ఉండి: అక్రమ అరెస్టుపై రిమాండ్‌లో ఉన్న తెదేపా జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి బాగోలేనందున ప్రభుత్వం తక్షణమే స్పందించి మెరుగైన వైద్యం అందించి, తగు వసతులు కల్పించాలని ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం శివరామరాజు విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ఆరోగ్యం క్షీణించినందువలన ప్రభుత్వం అలసత్వం వహించరాదని మెరుగైన వైద్యం కోసం మెరుగైన హాస్పిటల్స్‌కు తీసుకువెళ్లి వైద్యం చేయించాలనికోరారు. రాష్ట్రంలో ఇప్పటికే కక్షపూరిత రాజకీయాలు జరుగుతున్నాయని ఇది శుభ పరిణామం కాదని హితవు పలికారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

విశాలాంధ్ర - లింగపాలెం : వ్యవసాయ విధానంలో రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడిఏ నాగకుమార్ తెలిపారు. లింగపాలెంలో జరిగిన వ్యవసాయ శాఖ మండలస్థాయి సమావేశంలో ఈయన మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ విధానంపై శ్రద్ధ చూపాలని కోరారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, వీటిని సద్వినియోగించుకోవాలని అన్నారు. రైతుభరోసా కేంద్రాలలో రబీలో వేసే పంటలకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో మండల వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదల కోరుతూ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - గండేపల్లి : చంద్రబాబు అక్రమ కేసుల నుండి బయటపడి సత్య శీలుడుగా బయటకు రావాలని కోరుతూ గండేపల్లి మండలం మురారి గ్రామంలో గల శివాలయంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆదేశాల మేరకు మురారి తెలుగుదేశం పార్టీ పార్టీ అధ్యక్షులు సుంకవల్లి రాజారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ అక్రమ పద్ధతిలో ఏ విధమైన ఆధారాలు లేకుండా చంద్రబాబు నాయుడుని అరెస్టు చేసి నెల రోజులకు పైగా నిర్బంధించడం చాలా దారుణమని, ఆయన కోసం న్యాయపోరాటం, ధర్మపోరాటంతో పాటు దైవసంకల్పం కూడా తోడు కావాలని ఉమా రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో తొందర్లోనే చంద్రబాబు విడుదలవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉండవల్లి బుల్లిరాజు, గద్దె అబ్బన్న, చంద్రాల మల్లేశ్వరరావు, జాస్తి రాధాకృష్ణ, నిమ్మలపూడి రాంబాబు, ఉండవల్లి శ్రీను, చింతమనేని చంటిబాబుతో పాటు భారీ సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

నవోదయ కోచింగ్‌కు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర - తాళ్లపూడి : మండల ఏ.యస్.ఓ తన తండ్రి జోదాల పుల్లారావు పేరు మీద నవోదయ కోచింగ్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు అందజేశారు. తాళ్లపూడి మండలంలోని 5వ తరగతి చదువుతూ 6 వ తరగతి నవోదయ కొరకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు 8 వేల రూపాయల విలువ చేసే పుస్తకాలు ఉచితంగా అందించారు. ఏ.యస్.ఓ జోదాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత 3 సంవత్సరముల నుండి నవోదయ బుక్స్ తాళ్లపూడి మండలం, స్వగ్రామం బొర్రం పాలెం లో పేద పిల్లల విద్యకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ , టీచర్లు రామ కృష్ణ, శేష బాయమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదల కోసం శివయ్యకు పూజలు

విశాలాంధ్ర - గోపాలపురం : అక్రమ అరెస్టుకు గురై జైలులో ఉన్న చంద్రబాబు నాయుడు విడుదలను కోరుతూ చిట్యాలలో వేంచేసిన శ్రీ భీమలింగేశ్వర స్వామి వారి ఆలయంలో గద్దె గోపాలకృష్ణ, లక్ష్మీ ప్రియ పుణ్యదంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం పూజలు నిర్వహించారు. మండలంలోని చిట్యాల గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు తెలుగింటి ఆడపడుచుల సమక్షంలో శివాలయంలో మాస శివరాత్రి శుభ సందర్భంగా మన అధినాయకుడు చంద్రబాబు నాయుడు పేరున అష్టోత్తర పూజలు, కుంకుమార్చన దీర్ఘాయుష్ కలిగి ఉండాలని, సంపూర్ణ ఆరోగ్యంతో మచ్చలేని చంద్రుడిగా బయటికి రావాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గద్దె హరిబాబు, నూతంగి దొరబాబు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అనాతవరంలో బాబుతో మేము

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం మండలం అనాత వరంలో గ్రామ కమిటీ అధ్యక్షులు కురసాల శివబాబు ఆధ్వర్యంలో బాబుతో మేము కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ప్రతి ఒక్కరికి తెలియజేస్తూ 73 సంవత్సరాల వయసులో చంద్రబాబు నాయుడుని అన్యాయంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టి జగన్ మోహన్ రెడ్డి పైసాచిగా ఆనందం పొందుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మిమ్మితి చిరంజీవి, గుబ్బల తాతబ్బాయి, పేరిచర్ల సురేష్ రాజు, శీలం వెంకటేశ్వరరావు, కుంచే శ్రీను, అందే శ్రీను, మట్టపర్తి ఈశ్వరి, యళ్ల ఉదయ్, గొల్లకోటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా అరుణకుమారి

విశాలాంధ్ర -పెరవలి :తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల గ్రామానికి చెందిన అరిగెల అరుణ కుమారిని ఏఐసిసి, పిసిసి కమిటీ వారు నియమించారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు వెలువడినట్లు అరుణ కుమారి శుక్రవారం విలేఖరులకు తెలియజేశారు.ఆమె ప్రారంభం నుండి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ముక్కామల గ్రామ సర్పంచ్‌గా కొవ్వూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా, పెరవలి మండలం లైన్స్ క్లబ్ అధ్యక్షురాలిగా, తూర్పుగోదావరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా, ఏఐసిసి సభ్యురాలిగా అనేక పదవులు సమర్థవంతంగా నిర్వహించారు.తనకు అప్పగించిన ఈనూతన పదవిని మరింత బాధ్యతతో నిర్వర్తిస్తానని ఆమె తెలియజేశారు.

జిబిఆర్ కళాశాలలో డెంటల్ క్యాంపు

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక జిబిఆర్ జూనియర్ కళాశాలలో కేఎల్ఆర్ దంత వైద్యశాల (రాజానగరం)కు చెందిన వైద్యులు డెంటల్ క్యాంపు నిర్వహించారు. శుక్రవారం కళాశాలకు చెందిన అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు దంతాలు పరీక్షించి ఉచితంగా వైద్యం అందించారు. కె ఎల్ ఆర్ లెనోరా దంత వైద్య కళాశాల వైద్యులు అన్వేష్, కిరణ్ కార్తీక్, శశాంక్, లహరి, ధర్మ తేజ, యశస్వి, పల్లవి, మాధవి గారిగి వైద్య సేవలు అందించగా రాంబాబు, కర్రి శ్రీకాంత్ రెడ్డి క్యాంప్ విజయవంతం కావడానికి కృషి చేశారు.అనంతరం జిబిఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ ఎన్ పెద్ద అబ్బాయి రెడ్డి, పిఆర్ఎల్ స్వామి, కళాశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి ఉచిత క్యాంపులో వైద్య సేవలు అందించిన డాక్టర్లను ఘనంగా సత్కరించారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలతో అధిక ఆదాయం

విశాలాంధ్ర -పెరవలి :ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించడం వలన తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులతో పాటు అధిక ఆదాయం పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలో గల పలుగ్రామాలలో రైతులను కలిసి మాట్లాడారు.గ్రామాలలో రైతులకు ఎప్పటికప్పుడు సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆశాఖ సిబ్బంది ఉమామహేశ్వరరావు, కొండలరావు, వెంకటకృష్ణ, మహాలక్ష్మి రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు సమీపంలో మాదకద్రవ్యాల అమ్మకాలు నిషిద్ధం

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు పాఠశాల ప్రహరీక్లబ్‌ను ప్రధానోపాధ్యాయులు నక్కా సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు . పాఠశాల ఉపాధ్యాయులు అల్లు శ్రీను ప్రహరీ క్లబ్ విధులపై అవగాహన కల్పించారు. శుక్రవారం ప్రహరీ క్లబ్ వారు పాఠశాలకు సమీపంలో ఉన్న రెండు కిళ్ళీ షాపుల వద్దకు వెళ్ళి పాఠశాలకు వంద మీటర్ల దూరం వరకు ప్రభుత్వ ఆదేశానుసారం ఎటువంటి సిగిరెట్స్, గుట్కాలు, ఎటువంటి మాదకద్రవ్యాలు అమ్మరాదు అని వివరించారు. ఈకార్యక్రమంలో ప్రహరీ క్లబ్ సభ్యులు సహీనా, షణ్ముఖీ, భవ్య, భావన, వెంకట రమణ, కుమార్, సందీప్, కార్తీక్ పాల్గొన్నారు.

అన్నార్తులను ఆదుకోవడంలో ఆనందం

లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు

విశాలాంధ్ర-ఉండి: ఆకలితో అలమటిస్తూ రోడ్ల పక్కన జీవనం సాగిస్తున్న అన్నార్తులకు పిడికెడు అన్నం పెట్టడంలో ఎంతో ఆనందం ఉందని ఉండి లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కన్నెగంటి రూత్ కళ , వేగేశ్న అనంతలక్ష్మి అన్నారు. హంగర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉండి గ్రామంలోని బస్టాండ్ ,రైల్వే స్టేషన్, దేవాలయాలు, వివిధ ప్రాంతాలలో రోడ్లపై జీవనం సాగిస్తున్న అనాథలకు ఉండి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తినడానికి తిండి లేక కట్టుకోవడానికి వస్త్రాలు లేక నానా అవస్థలు పడుతూ ఉన్నవారికి పట్టెడు అన్నం పెట్టడంలో ఎంతో ఆనందం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మారెడ్డి, గొట్టుముక్కల రాము, కాగిత మహంకాళి, బొండాల కేశవరావు, భూపతి రాజు వాసు భూపతి రాజు హరినాధ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మార్పు వార్తలను ఖండించిన మాజీ ఎమ్మెల్యే శివ

విశాలాంధ్ర-ఉండి: తాను పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ఉండి మాజీ ఎమ్మెల్యే, టిడిపి సీనియర్ నాయకుడు వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) ఖండించారు. తాను పార్టీ మారబోతున్నాను అనే వార్తలో ఎలాంటి వాస్తవం లేదని కొంతమంది కావాలనే నామీద దుష్ప్రచారం చేస్తూ నా అభిమానులను ఉండి నియోజకవర్గ ప్రజలను గందరగోళంలోకి నెట్టుతున్నారని ఆయన మండిపడ్డారు. తాను ఎప్పుడూ తెదేపాకి విధేయుడుగా ఉంటూ పార్టీ కుటుంబ సభ్యుడిగా ఉంటానని ఈ విషయంలో ఎవరు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన అన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలకు అడ్డుకట్ట వేయాలని లేదంటే తగిన సమయంలో తగిన విధంగా వారికి బుద్ధి చెబుతామన్నారు.

నాణ్యమైన వైద్యసేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - పెద్దాపురం : రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ ఇంటిని, ప్రతీ కుటుంబాన్ని జల్లెడ పట్టి ప్రతీ గడపవద్దనే ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి ప్రతీ ఒక్కరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో సర్పంచ్ కురిమెళ్ల లోవరాజు అధ్యక్షతన జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడతూ దేశంలోని ఎక్కడా లేని విధంగా ప్రతీ ఇంటికి వెళ్ళి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీనేనన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పులిమేరు పీఏసీఎస్ అధ్యక్షులు గోపు నారాయణమూర్తి, గృహ సారదుల మండల కన్వీనర్ గోపు మురళి. ఎంపిటిసి కుంచే బుచ్చిరాజు, పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు. వైద్య సిబ్బంది. వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.31లక్షల మద్యం, నాటుసారా ధ్వంసం

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తూ పట్టుకున్న నాటు సారా, మద్యం బాటిల్స్‌ను స్థానిక స్టేషన్ ఆవరణలో రూ.లక్ష 30వేల విలువ గల వీటిని శుక్రవారం ధ్వంసం చేశారు. జిల్లా ఎడిషన్ ఎస్పి ఖాదర్ బాషా ఆదేశాల మేరకు అమలాపురం అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపర్డెంట్ ఎం శ్రీనివాసరావు, ఆలమూరు ఎస్ఈబీ ఎస్సై పి రాంబాబుల ఆధ్వర్యంలో ఈ సంవత్సరం మే, జూన్, జూలైలలో పట్టుకున్న వివిధ కేసులలో సీజ్ చేసిన నాటు సారా మద్యం బాటిల్స్‌ను ధ్వంసం చేశారు. 25 కేసుల్లో రూ.32,400ల విలువ గల 130 లీటర్ల నాటు సారా, రూ.99,000ల విలువ గల ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డిపిఎల్ రెండు కేసులలో 22 బాటిల్స్, ఎన్‌డిపిఎల్ 26 కేసులలో 172 లీటర్లు (328 బాటిల్స్)ను ఆలమూరు వీఆర్వోలు ప్రసాద్, వెంకట్‌ల సమక్షంలో ధ్వంసం చేసినట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

విశాలాంధ్ర - రాజానగరం : మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని జిఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అన్నారు.మండలంలోని జిఎస్ఎల్ వైద్య కళాశాలలో మూడు రోజులు పాటు జరగనున్న డాక్టర్ వైఎస్ఆర్ వైద్య విశ్వవిద్యాలయం స్థాయి ఉమెన్ మెడికో క్రీడలను డాక్టర్ గన్ని భాస్కరరావు శుక్రవారం ప్రారంభించారు.దీనిలో భాగంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తొలుత క్రీడాకారులు అందించిన గౌరవ వందనం స్వీకరించారు.క్రీడా పతకాలను పలువురు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానవుని మెదడును చురుగ్గా పనిచేసేందుకు ఉపయోగపడుతుందన్నారు.గెలుపు ఓటముల క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని సూచించారు.

రేపు చింతలపూడిలో మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-చాట్రాయి: ఈనెల 15వతేదీ ఆదివారం చింతలపూడిలో సూపర్ స్పెషాలిటీ డాక్టర్లచే ఉచిత మెగా వైద్య శిబిరం జరగనుందని సద్వినియోగం చేసుకోవాలని సామాజిక చైతన్య వేదిక ఆర్గనైజర్ ఇవి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చాట్రాయి మండలంలోని అనేక గ్రామాలు చింతలపూడి పట్టణానికి అతి దగ్గరలో ఉన్నాయని 15వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం మూడు గంటల వరకు చింతలపూడి శశి హై స్కూల్ వెలమపేటలో నవరత్నా లాంటి 9 మంది సూపర్ స్పెషాలిటీ డాక్టర్లచే ఎన్నడూ లేని విధంగా జివిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడ మణిపాల్ ఆసుపత్రి సూపర్ స్పెషాలిటీ డాక్టర్లచే మెగా వైద్య శిబిరం జరుపు తలపెట్టారని ప్రజలు వివిధ వ్యాధులతో బాధపడేవారు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రీ సర్వే వేగవంతం చేయండి

విశాలాంధ్ర - కాకినాడ : జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకంలో భాగంగా చేపట్టిన రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు కోరారు. సర్వే విధుల్లో ఉన్న ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలకు ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను శుక్రవారం సాయంత్రం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని సర్వేను మరింత పారదర్శకంగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సర్వేలో భాగంగా సరిహద్దుల నిర్ధారణ, ఇతర సమాచారాన్ని క్రోడీకరించి నిక్షిప్తం చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన రోవర్లు, ట్యాబ్ లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డిసిపి హరిదాస్, ఏసీపి నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, రిటైర్డ్ మేనేజర్ డివిఎస్ఎన్ మూర్తి, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్లు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఆర్బీకేలతో రైతులకు ఉపయోగం

విశాలాంధ్ర-గోకవరం: గ్రామీణ ప్రాంతాలలోని సన్న కారు రైతులకు తక్కువ ధరలకే అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందించడానికి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జగ్గంపేట నియోజకవర్గం శాసనసభ్యులు జ్యోతిర చంటిబాబు అన్నారు. శుక్రవారం గోకవరం మండలంలోని మారుమూల గ్రామమైన గంగంపాలెం సచివాలయ పరిధిలో 22 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. రైతుల సంక్షేమం కోసమే వైయస్సార్ జగన్ ప్రభుత్వం అన్ని రకాల చర్యలను తీసుకుంటుందని ఎమ్మెల్యే చంటిబాబు ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో గంగంపాలెం గ్రామ సర్పంచ్ దొడ్డి వెంకటలక్ష్మి నాగేశ్వరరావు ఎంపిటిసి సభ్యురాలు సీతాదేవి దుర్గ బాబు ఉప సర్పంచ్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సురేఖా షారోన్‌కు గిన్నిస్ బుక్‌లో చోటు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉప్పలపాటి రామచంద్ర రాజు శుక్రవారం తెలిపారు.ఈ ఎస్ ఎన్ పబ్లికేషన్స్ చెన్నై వారు ప్రచురించిన అడ్వర్టైజ్మెంట్ అడ్వర్టైజ్మెంట్ లో ఫిజిక్స్ అనే అంశం మీద గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో గణపవరం శ్రీ చింతలపాటి బాపిరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు సి.హెచ్ సురేఖా షారోన్ 'ఇంట్రడక్షన్ టూ గ్రీన్ కెమిస్ట్రీ' అనే అంశంపై రాసిన ఆర్టికల్ ఐఎస్ బి ఎన్ నంబర్ తో ప్రచురితమైంది. ఈ ఎస్ ఎన్ పబ్లికేషన్ వారు గిన్నీస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ తో పాటు ప్రశంసా పత్రం మరియు మెడల్ అందజేశారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర రాజు, లెక్చరర్ సురేఖా షారోన్ ని అభినందించారు. కళాశాల బోధన,బోధనేతర సిబ్బంది , విద్యార్థినీ,విద్యార్థులు అభినందనలు తెలిపారు.